15 రోజుల పాటు ట్రాఫిక్ మళ్లింపు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 25: ఆజామాబాద్ చౌరస్తా వద్ద కచ్చామోరీ పైప్‌లైన్ మరమతుల కారణంగా 15 రోజుల పాటు ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్టు చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ వీరేశం తెలిపారు. బుధవారం చిక్కడపల్లి ట్రాఫిక్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అజామాబాద్ చౌరస్తా వద్ద వరద నీరు చేరడంతో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నూతన పైప్‌లైన్ పనులు చేపడుతున్నారు. దీంతో గురువారం నుంచి 15 రోజుల పాటు ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ కింది నుంచి వచ్చే వాహనదారులు వీఎస్టీ చౌరస్తా నుంచి ఎడమవైపు దారికి మళ్లిస్తున్నట్లు తెలిపారు. వారు ముషీరాబాద్ బస్ డిపో నుంచి బయోలాజికల్-ఈ లిమిటెడ్ ముందు నుంచి విద్యానగర్ వైపు వెళ్లవచ్చు అని తెలిపారు. అదే విధంగా అడిక్‌మెట్ వయా రాంనగర్ నుంచి ఆజామామాద్ చౌరస్తా వైపు వచ్చే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. అడిక్‌మెట్ నుంచి వచ్చే వాహనాదారులు నేరుగా హిందీ మహావిద్యాల చౌరస్తా నుంచి ఆజామాబాద్ చౌరస్తా వైపు వెళ్లాలని సూచించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

అమీర్‌పేట్, సెప్టెంబర్ 25: ఈనెల 28 వరకు జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని, రాజీ మార్గం ద్వారా తమ పాత కేసులకు ముగింపు పలకాలని ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.సైదులు సూచించారు. చిన్న వివాదాల కారణంగా పెట్టుకున్న కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ చక్కటి వేదికని అన్నారు. పంతాలు, పట్టింపులకు పోకుండా భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని దీర్ఘకాలిక కేసులను ఇరుపక్షాల వారు రాజీ చేసుకునేందుకు మంచి అవకాశమని చెప్పారు. కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారు సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాత కేసులు, సివిల్, ఆస్తి పంపకాలు, భార్యభర్తల వివాదాలు, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్, పేకాట, ఎక్సైజ్, దొంగతనం, చలాన్ల పెండింగ్, రోడ్డు ప్రమాద కేసులు, వివాదాలను లోక్ అదాలత్ ద్వారా సామరస్యంగా పరిష్కరించుకునే వీలుందన్నారు. సందేహాలుంటే ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పీఎస్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విభాగాన్ని సంప్రదించవచ్చన్నారు.

గువాహటిని సందర్శించిన ప్రజాప్రతినిధులు

- డంపింగ్ స్టేషన్ నిర్వహణపై అధ్యయనానికి వెళ్లిన డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

గువాహటి డంపింగ్ స్టేషన్ నిర్వహణను డిప్యూటీ మేయర్, ఇతర కార్పొరేటర్లకు వివరిస్తున్న అక్కడి అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 25: జీహెచ్ఎంసీ అధికారిక అధ్యయన పర్యటనలో భాగంగా అస్సోంలో ఉన్న నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు బుధవారం గువాహటి డంపింగ్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ చెత్తను ఎలా శుద్ధి చేస్తారో, వారు అనుసరిస్తున్న పద్ధతులు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహణపై వివరించారు. ల్యాండ్ ఫిల్లింగ్‌ను ప్రామాణిక విధానాలను అనుసరించి పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం ఆ భూమిని చెత్త రహితంగా చేసి, గువాహటి మునిసిపల్ కార్పొరేషన్‌కు వివిధ ప్రయోజనాల కోసం అప్పగిస్తామని వివరించారు. ఈ ప్రాజెక్టును జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహిస్తోందని పేర్కొన్నారు. అనంతరం గువాహటి నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను డిప్యూటీ మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గువాహటిలో చెత్త నిర్వహణలో అవలంబిస్తున్న సాంకేతికత, పర్యావరణానికి హాని కలిగించకుండా తీసుకుంటున్న చర్యల గురించి తెలుసుకున్నట్టు చెప్పారు. ఈ విధానం జీహెచ్ఎంసీ పరిధిలో తీసుకురావడంలో సాధ్యాసాధ్యాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. తద్వారా చెత్త నిర్వహణ సమస్యలకు ఒక శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. గువాహటి మునిసిపల్ కార్పొరేటర్, జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య సమన్వయం ద్వారా చేపట్టిన ఈ ప్రాజెక్టు ఇతర నగరాలకు ఆదర్శంగా నిలుస్తుందని ప్రశంసించారు.

25ఓయూ1: గువాహటి డంపింగ్ స్టేషన్ నిర్వహణను డిప్యూటీ మేయర్, ఇతర కార్పొరేటర్లకు వివరిస్తున్న అసోం రాష్ట్ర అధికారులు

నోట్ పుస్తకాలు అందజేసిన లయన్స్ క్లబ్

మేకలమండి పాఠశాలలో నోట్ పుస్తకాలు అందజేసిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 25: భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ వెస్ట్ మారెడ్‌పల్లి, సికింద్రాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వైసీ సుంకి మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ, సమయపాలన, చిత్తశుద్ధితో చదువుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు లోనా డిమ్మీ, టి.స్వరాజ్, రాంచందర్ హాజరయ్యారు. అనంతరం పాఠశాల విద్యార్థుల తరపున హెచ్ఎం స్వరూప దాతలను సన్మానించి, ధన్యవాదాలు తెలిపారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహిస్తున్న సికింద్రాబాద్ తహసీల్దార్ పాండునాయక్, సిబ్బంది

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 25: మోండా మార్కెట్‌లోని ఓల్డ్ జైల్ ఖానా గోడకూలి పక్కనే ఉన్న 6 టైలర్ షాపులపై పడి నష్టపోయిన బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బుధవారం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కొన్నేండ్ల నుంచి సుమారు 20 కుటుంబాలు టైలరింగ్‌తో జీవనం పొందుతున్నాయని అన్నారు. అనుకోని ప్రమాదంతో షాపులు కూలిపోవడం, కుట్టు మిషన్లు, సామగ్రి ధ్వంసమైందని ఎమ్మెల్యే కలెక్టర్‌కు వివరించారు. ముఖ్యంగా రానున్న దసరా, దీపావళి సందర్భంగా కస్టమర్లు ఇచ్చిన బట్టలు శిథిలాల్లో కలిసిపోయాయని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఎమ్మెల్యే కోరారు. స్పందించిన కలెక్టర్ బాధిత కుటుంబాలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే తలసాని చొరవతో టైలర్ షాపుల వద్దకు సికింద్రాబాద్ తహసీల్దార్ పాండు నాయక్, అధికారులు చేరుకొని పంచనామా నిర్వహించారు.

తిరుమల లడ్డూ పవిత్రతను కాపాడాలి


నామాలగుండు కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో దీక్షలో పాల్గొన్న నాయకులు

సికింద్రాబాద్, సెప్టెంబర్ 25: తిరుమల లడ్డూ పవిత్రతను కాపాడాలని, దోషులను కఠినంగా శిక్షించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సికింద్రాబాద్ నామాలగుండు కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో లష్కర్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో చైర్మన్ ప్రకాశ్‌రావు సహకారంతో ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. పలు పార్టీల నేతలు మాట్లాడుతూ ఎంతో ప్రసిద్ధి పొందిన తిరుమల లడ్డూ తయారీలో అపవిత్రం జరిగిందని ఆరోపణలు రావడం దురదృష్టకరమని అన్నారు. సంబంధిత అధికారులను తక్షణమే విధుల నుంచి తొలగించి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకుడు రవి ప్రసాద్ గౌడ్, సారంగపాణి, రాచమల్ల కృష్ణమూర్తి, గరిగె ప్రవీణ్, కుంచాల ఏడుకొండలు, బాలరాజుయాదవ్, కొండల్ వెంకటేశ్వరరావు, కృష్ణ ముదిరాజ్, శైలేందర్, బాబురావు, అశోక్‌చారి, గరిగెపోగుల చంద్రశేఖర్, మహాత్మా, పర్రె గోపాల్, వివేక్, పలు సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు.

28న అక్కినేని స్వరనీరాజనం

ముషీరాబాద్, సెప్టెంబర్ 25: కృతిలయ ఆర్ట్స్, సీల్‌వెల్ కార్పొరేషన్ సంయుక్తంగా అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా స్వరనీరాజనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బండారు సుబ్బారావు, పన్నాల బాల్‌రెడ్డి, భీంరెడ్డి తెలిపారు. బుధవారం గానసభలో ఏర్పాటు సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 28న త్యాగరాయ గానసభలో ఆకాశవీధిలో అందాల జాబిలి శీర్షిక ప్రముఖ గాయకులచే సంగీత విభావరి నిర్వహించనున్నట్లు తెలిపారు.

బీసీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

అమీర్‌పేట్, సెప్టెంబర్ 25: తెలంగాణ కాంగ్రెస్ గత ఎన్నికల సమయంలో కామారెడ్డిలో చేసిన బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉందని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన బుధవారం బేగంపేట్‌లోని హోటల్ ప్లాజాలో బీసీ కులగణనపై తెలంగాణలోని బీసీ సంఘాలతో కలిసి నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ కులగణన జరిగి తీరుతుందని, ఆ తరువాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. బీసీ కులగణనపై బీజేపీ మీనమేషాలు లెక్కిస్తోందని, అదేండ్ల క్రితం ఆర్ఎస్ఎస్ రిజర్వేషన్లకు వ్యతిరేకమంటూ తమ వైఖరిని స్పష్టం చేసిందని గుర్తుచేశారు. తాజా రాజకీయ పరిస్థితులతో తాము అనుకూలమంటూ ఓట్ల రాజకీయాలకు తెరతీసిందని, బీజేపీ ద్వంద వైఖరిని ప్రజలు తిరస్కరిస్తారన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి పూర్తి సానుకూలతతో ఉన్నారని, త్వరితగతిన కులగణన రాష్ట్రంలో ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కామారెడ్డిలో కాంగ్రెస్ చేసిన బీసీ డిక్లరేషన్‌ను తాము విశ్వసిస్తున్నామని, త్వరితగతిన కులగణన ప్రారంభమవుతుందని ఆశిస్తున్నామన్నారు. మాజీ ఎంపీ వీహెచ్, బీసీ కులసంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్‌చారి, కన్వీనర్ బాలగోని బాలరాజు, ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి

బేగంపేట్, సెప్టెంబర్ 25: ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ సూచించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ ఆదేశాల మేరకు బుధవారం బేగంపేట్‌లోని ఉద్భవ్ స్కూల్ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు-నివారణపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ మైనర్లు వాహనాలను నడిపితే చట్టరిత్యా నేరమని చెప్పారు. రహదారులపై క్రమశిక్షణగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులతో పాటు టీటీఐ సిబ్బంది కృష్ణ, నసీర్ ఉన్నీసాబేగం, వర్ష సింగ్, మహ్మద్ ఆయాన్ తదితరులు పాల్గొన్నారు.

జెన్నీకి అక్కినేని ఆత్మీయ పురస్కారం

సినీ నటుడు జెన్నీకి పురస్కారాన్ని అందచేసిన విజయ్‌బాబు

ముషీరాబాద్, సెప్టెంబర్ 25: రాగరాగిణి సంస్కృతి సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ అక్కినేని శతజయంతి ఉత్సవాలు జరిగాయి. కార్యక్రమంలో ఆర్టీఐ మాజీ ముఖ్య కమిషనర్ పి.విజయ్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై సినీ నటుడు జెన్నీకి అక్కినేని ఆత్మీయ పురస్కారం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా సినీ సంగీత విభావరి పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో సి.రామకృష్ణ, శైలజ, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎంవీ రమణకుమారి, ప్రధాన కార్యదర్శి ఎంవీ సుబ్బలక్ష్మి, కృష్ణకుమారి, స్వర్ణ, ఉష తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

వ్యర్థాల తొలగింపు బండ్లను అందజేస్తున్న కార్పొరేటర్

బేగంపేట్, సెప్టెంబర్ 25: ప్రతిఒక్కరు తమ వంతు బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు కృషి చేయాలని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర సూచించారు. స్వచ్ఛహీ సేవాలో భాగంగా జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ ఆధ్వర్యంలో అందించిన వ్యర్థాల తొలగింపు, తోపుడు బండ్లను బుధవారం రాంగోపాల్‌పేట్‌లోని మహంకాళి ఆలయం వద్ద 12 మంది సఫాయి కర్మాచారులకు కార్పొరేటర్ చేతుల మీదుగా బండ్లను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులు విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ పరిసరాలను శుభ్రం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ ఎస్ఎస్ ధనగౌడ్, రాంగోపాల్‌పేట్ డివిజన్ బీజేపీ నాయకులు చీర శ్రీకాంత్, ఆకుల ప్రతాప్, నరేశ్, నితేశ్ బోలే, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కరానికి కృషి చేయండి

ఆదం సంతోష్‌తో సమస్యలపై మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

అడ్డగుట్ట, సెప్టెంబర్ 25: నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కరానికి కృషి చేయాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్ కాంగ్రెస్ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌ను బుధవారం కలిసి కోరారు. నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో మంచి నీటి, డ్రైనేజీ, రోడ్డు సమస్యలున్నాయని, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరానికి కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తయ్యేలా అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అదే విధంగా అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాబు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ.వినోద్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 25: తక్షణమే హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేయించాలని కోరారు. ఓయూ లా కళాశాల ఆవరణలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి బుధవారం పూలమాల వేసిన అనంతరం వినోద్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రప్రభుత్వానికి పంపి, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎంకు సూచించారు. ఏపీ ప్రభుత్వం కర్నూల్‌లో హైకోర్టు బెంచ్, అమరావతిలో న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. అన్నివర్గాలకు న్యాయం దరిచేరేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. అంబేద్కర్ సిద్ధాంతాలకు పాలకులు ఏనాడో తిలాదకాలు ఇచ్చారని అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్య భారతావనిలో దక్షిణ భారతదేశానికి ఏనాడూ సరైన న్యాయం జరగలేదని ఆరోపించారు. అనాదిగా అధికారంలో ఉన్న ఉత్తరాది పార్టీలు దక్షిణ భారత అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం వహించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దక్షిణాదిని తగిన రీతిలో అభివృద్ధి చేయాలని కోరారు.

బల్కంపేట అమ్మవారి హుండీ లెక్కింపు

అమీర్‌పేట్, సెప్టెంబర్ 25: బల్కంపేట ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు బుధవారం జరిగింది. మొత్తం 52 రోజులకు రూ.51.48 లక్షల ఆదాయం సమకూరింది. 180 యూఎస్ డాలర్లు, మలేషియా రింగిట్ 9, న్యూజిల్యాండ్ డాలర్లు 20, ఇండోనేషియా కరెన్సీ 2000లు ఉన్నాయి. లెక్కింపును దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవితో పాటు ఆలయ ఈవో బి.కృష్ణ, చైర్మన్ సాయి బాబాగౌడ్ పర్యవేక్షించారు. భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు లెక్కింపులో పాల్గొన్నారు.

పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళి

బొల్లారం, సెప్టెంబర్ 25: ఏకాత్మ మానవతావాదాన్ని ప్రవచించి, అంత్యోదయ విధానాన్ని రూపొందించిన గొప్ప వ్యక్తి పండిత దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భానుక మల్లికార్జున్ అన్నారు. బుధవారం పండిత్ దీన్‌దయాళ్ జయంతిని బోయిన్‌పల్లిలోని (ఎన్ఐఎంహెచ్)కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భానుక మల్లికార్జున్ పండిత దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు, వీల్ కుర్చీలు, చెవి వినికిడి పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ సంజయ్ సింగ్, నాగేశ్వర్‌రావు, అజయ్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, పృథ్విక్‌జైన్, మధు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భానుక మల్లికార్జున్, ప్రతినిధులు

గాంధీనగర్‌లో

చిక్కడపల్లి: గాంధీనగర్‌లో పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ హాజరై నివాళులర్పించారు. బీజేపీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూసరాజు, రమేశ్‌రాం, జి.శ్రీకాంత్, శివకుమార్, సురేశ్, అరుణ్‌కుమార్, ఆనంద్‌రావు, ఆకుల సురేందర్, నవీన్‌కుమార్, సత్తిరెడ్డి, రవియాదవ్, నీరజ్, రఘు, ప్రకాశ్, శశికుమార్, సాయి తరుణ్ పాల్గొన్నారు.

సనత్‌నగర్‌లో

అమీర్‌పేట్: దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు బీజేపీ నాయకులు నివాళులర్పించారు. సనత్‌నగర్ బీజేపీ అధ్యక్షుడు కన్నూరి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో నెహ్రూపార్క్ వద్ద దీన్‌దయాళ్ జయంతి జరిగింది. లింగంపల్లి నర్సింగ్‌రావుతో పాటు సీనియర్ నాయకులు దయానంద్, మూల రవీందర్, కన్నూరి చంద్రకుమార్ పాల్గొన్నారు.

బౌద్ధనగర్, తార్నాక డివిజన్లలో

ఉస్మానియా యూనివర్సిటీ: దీన్‌దయాళ్ జయంతిని బౌద్ధనగర్, తార్నాక డివిజన్లలో నిర్వహించారు. బౌద్ధనగర్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర నేత పి.రవిప్రసాద్‌గౌడ్, కుమార్, కాసాల నాగేశ్, సుబ్బారావు, సత్యనారాయణ, కిషన్, రాం బాబు, అశోక్, పూర్వచందర్, భరత్, శ్రీనివాస్, రవి, రాజు పాల్గొన్నారు.

ఎరుకలబస్తీ సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే

మారేడ్‌పల్లి ఎరుకలబస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 25: మోండా డివిజన్ మారేడ్‌పల్లిలోని ఎరుకలబస్తీ, లక్ష్మయ్యదొడ్డి ప్రాంతాల్లో బుధవారం జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి ఎమ్మెల్యే శ్రీగణేశ్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బస్తీలో విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, కలుషిత నీరు సరఫరా తదితర సమస్యలు ఉన్నాయని స్థానిక మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా ఈబస్తీలో నెలకొన్న సమస్యల పరిష్కరానికి తన వంతు కృషి చేస్తానని, ఇందుకు అవసరమైన నిధులు కేటాయించి సమస్య శాశ్వత పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, డీఈలు ధర్మారెడ్డి, అంజనేయులు, జలమండలి డీజీఎం సాగర్, ఏఈ హకీం, నాయకులు సి.బద్రినాథ్‌యాదవ్, సి.సంతోష్‌యాదవ్, బహీర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పెన్షనర్స్ నిరసన

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 25: సికింద్రాబాద్ చిలకలగూడలోని ఆలిండియా రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్ కార్యాలయం వద్ద బుధవారం రైల్వే పెన్షనర్స్ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసనకు మద్దతును ప్రకటించారు. 8వ వేతన సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. 18 నెలల కరువు భత్యం, బకాయి వెంటనే విడుదల చేసి, పెన్షన్ పెంపునకు వయసు పరిమితి తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు వై.యుగంధర్, ఎస్.రాజు, కేఎస్ స్వామి, శివకుమార్, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఆలిండియా రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్ 64వ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా వెరికోస్ వెయిన్స్‌తో బాధ పడుతున్న రైల్వే పెన్షనర్లకు డాక్టర్ భార్గవ్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. రైల్వే పెన్షనర్లకు మెరుగైన ఆరోగ్యం కోసం వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు ఎస్.శ్రీధర్ వెల్లడించారు.

28, 29 తేదీల్లో డీడీఎంఎస్ కోఫేమ్‌లో సంగీత పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 25: ఓయూ క్యాంపస్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ (డీడీఎంఎస్) కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్ (కోఫేమ్)లో ఈనెల 28వ తేదీ నుంచి సంగీత పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ వై.రమాప్రభ, ప్రిన్సిపాల్ కె.విజయ ఒక ప్రకటనలో తెలిపారు. 28న సీనియర్, సూపర్ సీనియర్ కేటగిరీలకు, 29న జూనియర్, సబ్ జూనియర్ కేటగిరీలకు కర్ణాటక గాత్ర-వీణ పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆసక్తి గల వారు వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పోటీల రోజే కళాశాలకు వచ్చి సైతం స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. ఇతర వివరాలకు 94417 68811, 94413 86157 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆల్ సోల్స్ డేకు ఏర్పాట్లు చేయాలని వినతి

కార్పొరేటర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న చర్చి నిర్వాహకులు

అడ్డగుట్ట, సెప్టెంబర్ 25: ఆల్ సోల్స్ డేకు ఏర్పాట్లు చేయాలని మెట్టుగూడ సెయింట్ ఆంథోని చర్చి నిర్వాహకులు బుధవారం స్థానిక కార్పొరేటర్ రాసూరి సునీతను కోరారు. చర్చి నిర్వాహకుల ఆహ్వానం మేరకు చర్చిలో జరిగిన సమావేశానికి కార్పొరేటర్ హాజరయ్యారు. నవంబర్ 2న జరగనున్న ఆల్ సోల్స్ డే సందర్భంగా మెట్టుగూడలోని క్రిస్టియన్ శ్మశానవాటికలో మరమ్మతు పనులను చేపట్టాలని కోరారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ఆల్ సోల్స్ డేకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

పాటిగడ్డ బస్తీ ఎన్నికలపై విచారణ జరపాలి